# రావిశాస్త్రి సాహితి-II

## RAAVISASTRY SAAHITI -II

## "రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్య సమాలోచనం"

**A Special issue on " RAAVI SASTRY's Literature "**

**INTERNATIONAL SEMINAR RESEARCH PAPERS HELD ON 29,30,31St JULY 2022**

**On the Occassion of Raavisastry's Centenary celebrations**

**29, 30, 31 జూలై 2022**














సంపాదకుడు
డా॥ కె.వి.యన్.డి.వరప్రసాద్
తెలుగుశాఖాధిపతి
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

REDMI NOTE 5 PRO

# S.G.A. GOVT. DEGREE COLLEGE
YELAMANCHILI

ANAKAPALLI DIST

**(Reaccredited by NAAC with 'A' Grade)**

# DEPARTMENT OF TELUGU


## V A SATYANARAYANA LECTURER IN TELUGU
## PARTICIPATED INTERNATIONAL SEMINAR ON 30-7-2022









# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం

తెలుగు శాఖ, రావిశాస్త్రి శతజయంతి సందర్భంగా నిర్వహించిన

"రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్య సమాలోచనం"

అంతర్జాతీయ సదస్సు

75 Azadi Ka Amrit Mahotsav

## ధ్రువ పత్రము/CERTIFICATE

This is to certify that Prof./ Dr./ Mrs./Mr./Miss. V.A Satyanarayana.
Lecturer in Telugu.
of SGA Govt Degree College, Yellamanchili has participated and presented the paper Entitled " Ravisastry pipeelika Sandesham".

in the three days International Seminar on "An Analytical criticism on Raavisastry's Literature" రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్య సమాలోచనం organized by Dept. of Telugu, Adikavi Nannaya University, Rajamahendravaram on 29th,30th & 31st July, 2022.

1922 - 2022

**Dr.K.V.N.D.Vara Prasad**
Director, International Seminar
Head, Dept. of Telugu
Adikavi Nannaya University.

**Prof. S. Teki**
Principal UCAC & OSD
Adikavi Nannaya University.

**Prof. T. Ashok**
Registrar
Adikavi Nannaya University.

ISBN : 978-93-5777-746-9



## 32. రావిశాస్త్రి పిపీలిక సందేశం

వి ఏ సత్యనారాయణ
తెలుగు అధ్యాపకుడు
శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల
ఎలమంచిలి, అనకాపల్లి జిల్లా.
చరవాణి : 92472 31382

తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన కథా రచయితలలో శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఒకరు. రావిశాస్త్రిగా ఆంధ్ర పాఠకలోకంలో లబ్ధ ప్రతిష్ఠులైన వీరు తమ అద్భుతమైన ప్రతిభతో సామాన్యుల జీవితాలను అనితర సాధ్యంగా చిత్రించిన కీర్తి గడించారు. వాస్తవాన్ని ప్రతిబింబించేలా రచనలు చేయడం, ఆలోచనలు రేకెత్తించేవిధంగా పాత్రల్ని సృష్టించడం వీరికి ఉన్న ప్రత్యేకత. తెలుగు భాషకు ప్రత్యేక సొగసును, ఉత్తరాంధ్ర మాండలికానికి సాహిత్య గుబాలింపును రావిశాస్త్రి తీసుకొని వచ్చారు. (లిరికల్ బ్యూటీ) కవితాత్మను తన రచనల్లో తీసుకురావడంలో ప్రసిద్ధుడిగా రావిశాస్త్రి గారిని సాహితీవేత్తలు ప్రత్యేకంగా కొనియాడారు. "తెలుగు కథకు రెక్కలు తొడిగి ప్లేన్ టిక్కెట్ ఇప్పించి దేశాంతరాలకు తీసుకొని వెళ్ళిన గొప్ప కథకుడు రావిశాస్త్రి" అని గొల్లపూడి మారుతీరావుగారు ప్రశంసించారు. తన 71 ఏళ్ల జీవితంలో 56 ఏళ్లపాటు రచనలు చేసి, సమాజంలో బాధాసర్పదష్టుల పట్ల మమకారాన్ని ప్రదర్శించి వారిపట్ల ఫీజు లేకుండా వకాల్తా పట్టిన నిజమైన అసలైన న్యాయవాది రావిశాస్త్రి. ఇంతకుముందు మనకు తెలుగు సాహిత్యంలో ఈ విధంగా ఫీజు లేకుండా వకాల్తా పట్టిన సందర్భానికి ప్రతినిధిగా శ్రీ గురజాడ అప్పారావుగారు కనిపిస్తారు. వారు గ్రామీణ భాష అని ఆనాటి పండితులు ఈసడించిన వ్యవహారిక భాష గురించి మాట్లాడుతూ "గ్రామ్య భాష దిక్కుమాలిన స్త్రీ. ఆమెను పండితులు నిరాదరణ చేయడంతో ఫీజు లేకుండా వకాల్తాపట్టితిని" అని చెప్పి దాని ఉద్ధరణకు కృషి చేశారు. ఆ తరువాత మళ్లీ వ్యవహారిక భాష గురించి ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలిక భాషను వ్యవహరించే సామాన్యుల గురించి వకాల్తా పట్టినది రావిశాస్త్రి గారే.

రావిశాస్త్రి 1922 జూలై 30వ తేదీన జన్మించారు. 1993 నవంబరు 10వ తేదీన పరమపదించారు. వారి స్వస్థలం అనకాపల్లి దగ్గరి తుమ్మపాల . ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో బి.ఏ. ఆనర్స్, తత్వశాస్త్రం చదివిన రావిశాస్త్రిగారు 1935ల నుంచి కథా రచన ప్రారంభించారు. రావిశాస్త్రి 1950ల నుంచి సమాజ జీవితాన్ని ప్రతిబింబించే రచనలు చేశాడు. మొదట కాంగ్రెస్‌వాదిగా ఉన్నా, తరువాత మార్క్సిజమ్ అందించిన సామాజిక చలన సూత్ర స్పృహను అవగాహన చేసుకుని, సాంఘిక రాజకీయ ఆర్థిక అసమానతలను ప్రశ్నిస్తూ, అణగారిన వర్గాల జీవితాలను చిత్రిస్తూ గొప్ప రచనలు చేశాడు. రావిశాస్త్రి గురించి చలసాని ప్రసాద్ "రావిశాస్త్రి దాపరికం లేని, దొంగతనం ఎరుగని రచయిత. ఏ పరిస్థితులలోనూ బాధ్యతను విస్మరించని రచయిత. భద్రత కోసం, కీర్తి కోసం పాకులాడని రచయిత" అని అంటారు. ఇక మహాకవి శ్రీశ్రీ "ఏకకాలంలో అనేక రసాలను ఉప్పొంగింపజేసే రచనలే కళాఖండాలు. అలాంటి రచనను రసన అంటాం. అలాంటి రసానుభూతిని రావిశాస్త్రి రచనలు సమృద్ధిగా ఆవిష్కరించగలుగుతున్నాయి" అని

ISBN : 978-93-5777-746-9

ప్రశంసించారు. ఇలా ప్రముఖుల ప్రశంసలు అందుకున్న రావిశాస్త్రి 'ఎందుకు రాసేను' అనే వ్యాసంలో "తను రాసే విషయం ఏ మంచికి హాని చేస్తుందో, ఏ చెడ్డకు మంచి చేస్తుందో అనే విషయం రచయితకు తెలియాలి" అని అంటారు. ఇది రావిశాస్త్రి వ్యక్తిత్వాన్ని పట్టి చూపే గొప్ప అభిప్రాయం.

స్వాతంత్ర్య ఫలాలు అందుకోలేని ప్రజల దుర్భర జీవితాల్లో నుంచి ఆందోళనలు నక్సల్ బరి ఉద్యమం, విరసం వంటి సంస్థల ఆవిర్భావానికి దారితీసాయి. ప్రజా చైతన్యం కోసం దోపిడీ నిర్మూలన కోసం కవులు రచయితలు తమ కలాలను కదను తొక్కించారు. ఈ క్రమంలో విరసం కు ఉపాధ్యక్షునిగా రావిశాస్త్రి ఒక స్పష్టమైన లక్ష్యంతో రచనలు చేశాడు. రాజ్యాధికారం తన అధికార జులుం ప్రదర్శించినప్పుడు, దానిని ఎదిరించే గుండె నిబ్బరాన్ని ప్రజలకు కలిగించే ధ్యేయంతో, భయాన్ని నిర్మూలించి ధైర్యాన్ని నూరిపోసే రచనలు రావిశాస్త్రి చేశాడు. ముఖ్యంగా ఇతడు రాసిన "బాకీ కథలు" అనే సంపుటిలోని 'పిపీలికం, వేతన శర్మ, షోకు పిల్లి' వంటి కథలు ఈ కోవలోనికి చెందినవే. వాటిలో పిపీలీకం ప్రత్యేకమైనది. పీపీలికం అంటే చీమ. చీమ సృష్టిలో కంటికి కనిపించే చిన్న ప్రాణి. అల్పజీవుల్లా కనిపించే చీమల్లో సాంఘిక ఐకమత్యం ఎక్కువ. ఆ ఐకమత్యంతోనే అవి బలవంతమైన సర్పాన్నయినా చంపగలవు. సమాజంలో చీమల్లాంటి బడుగు జీవులలో కూడా ఇలాంటి ఐకమత్యం రావాలన్నది రావిశాస్త్రి ఆకాంక్ష. అదే రావిశాస్త్రి పీపీలిక సందేశం.

పిపీలికంలో చీమ కష్టజీవి. శ్రమజీవులకు ప్రతీక. వ్యవస్థలో అగ్రవర్ణాల పేరుతో, ఆచారాల పేరుతో, పాలకవర్గాల పేరుతో, అధికారాల పేరుతో, విద్యల పేరుతో, శ్రామిక వర్గాలను దోపిడీ చేసే వ్యక్తులకు కొదవలేదు. ఆ వర్గాలకు ప్రతీకలుగా మొదట గోపన్నపాలెం నిగమశర్మ, ఆ తరువాత జన్నాలపల్లి చతుర్వేది, చివరగా రాక్షసాకారం పిపీలికంలో కనిపిస్తారు. మనకు కనిపిస్తారు. వీరంతా ఈ వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని కష్టజీవుల కష్టాన్ని దిగమింగే వారే. ఈ విషయాన్ని రచయిత చాలా లాఘవంగా కవితాత్మకంగా ఈ కథలో చిత్రిస్తాడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం ఒకే బ్రహ్మ ఉన్నాడన్న సత్యాన్ని అనుభవానికి తెచ్చుకోవడానికి, తానెవరో తెలుసుకోవడానికి ఒక చీమ ప్రయత్నిస్తుంది. దానికోసం మొదటగా గోపన్నపాలెంలోని నిగమశర్మ అనే బ్రాహ్మణున్ని ఆశ్రయిస్తుంది. నిగమశర్మ ఆత్మ పదార్థానికైనా సరే, బ్రహ్మ పదార్థానికైనా సరే ఆకలి మాత్రం తప్పదని తెలిసినవాడు. అంతే కాదు అతడు ఈ చీమ అతని ఇల్లు చేరేసరికి గొప్ప ఆకలి మీద ఉన్నాడట. చీమ అతన్ని జ్ఞానకాంక్షతో చూస్తే, అతడు మాత్రం చీమను ఆకలి చూపుతో చూసేడట. అలాగని అతడు సర్వభక్షకుడు కాడట. అతడు చీమలను కానీ మానవులను కానీ తినడట. వారి కష్టాన్ని మాత్రమే తినగలడట. అందుకే "స్వామి! నేను ఎవరిని? ఎందుకు పుట్టాను? ఎందుకు బ్రతుకుతున్నాను? ఎందుకు చస్తాను?" అని సవినయంగా ప్రశ్నించిన చీమ తాలూకా బ్రహ్మ జిజ్ఞాస అవసరం, ఆకలితో బ్రతికే నిగమశర్మకు నాలుగు నూకలు లాగే అవకాశంగా అనిపించింది. ఇంటికి మూడేసి నూకలు ముష్టెత్తుకొనే నిగమశర్మకు గిద్దెడు నూకలు ఇవ్వగలిగే కల్పతరువులా చీమ కనిపించింది. నిగమశర్మ తన యొక్క ఆశను గాంభీర్యం వెనుక దాచి దానికి ఆ జ్ఞానం తెలిపేందుకు ప్రతి దినం ఓ గిద్దెడు నూకలు ఇయ్యమంటాడు. ఆపైన చీమ ఎద్దులా కష్టపడి, గింజ గింజ చొప్పున గింజలు గురువుకు సమర్పిస్తుంది. ఈ రకంగా నిగమశర్మ చీమ కష్టాన్ని చాన్నాళ్లు అనుభవించాక తను చెప్పగలిగినంత మేరకు చాలా ఆలస్యంగా చెప్పి చివరి రోజు పరబ్రహ్మములా నవ్వి 'తానెవరని అడిగిన చీమ'కు "నువ్వు

ISBN : 978-93-5777-748-9

చీమవు" అని అంటాడు. చీమకు తాను చీమనని తెలుసుకొని ఆనందించింది. అయితే ఆ ఆనందం కొన్నాళ్లకే పోయింది. అది మళ్ళీ నిగమశర్మను ఆశ్రయించి చీమంటే ఏమిటి?! కళ్ళా, కాళ్ళా....." ఇలా తనకొచ్చిన సందేహాలను వెలిబుచ్చింది. ఆ జ్ఞానం తెలియని నిగమశర్మ అప్పుడు చీమను జన్నాలపల్లి చతుర్వేది వద్దకు పంపుతాడు. అక్కడ చీమను తమ గురువు చతుర్వేదితో కలవనీయకుండా సచ్ఛిష్యులు అడ్డుకొనే ప్రయత్నం చేస్తారు ప్రయత్నిస్తారు. చీమ మొత్తానికి యమ ప్రయాసలకు ఓర్చి చతుర్వేదిని కలుసుకుంటుంది. చీమ శిష్యుల సందేహాటంకాలను దాటుకొని, చివరకు హిరణ్యం గురుదక్షిణగా ఇచ్చుకొని సంవత్సరాలపాటు శ్రమిస్తుంది. ఆ తర్వాత "సోహం" బోధతో బ్రహ్మజ్ఞానం పొందినప్పటికీ, చీమ బ్రతుకులో ఏం తేడా కూడా కనిపించక పోయింది. ఆ చింతను బాపుకోవడానికి మరొక మహా రుషిని ఆశ్రయించింది. యోగ సాధన చేసి, తపస్సు చేస్తే, జన్మరాహిత్యాన్ని సంపాదించి మోక్షాన్ని సంపాదించవచ్చనే ఋషికి .అసలు "ఏ జీవికైనా జన్మరాహిత్యం ఎందుకు? మోక్షం ఎందుకు?" అని తిరిగి చీమ ప్రశ్నిస్తుంది. దానికి సమాధానం చెప్పలేక ఋషి మౌనముద్రా లంకితుడవుతాడు. అతడి నుంచి సమాధానము రాదని తెలిశాక ఇంటికి తిరుగు ముఖం పడుతుంది చీమ.

చీమ ఇంటికి వచ్చేసరికి తమ ఇంట్లోకి ఎవడో రాక్షసుడు ప్రవేశించినట్లు తెలుసుకుంటుంది. 'తమ ఇంట్లోకి, అనుమతి లేకుండా ఎందుకు వచ్చావ'ని ఆ రాక్షసాకారాన్ని చీమ ప్రశ్నిస్తుంది. దానికి ఆ రాక్షసాకారం. 'తాను సుఖ భోగినని, చీమ ఒక కష్టజీవి అని, కష్టజీవులు కష్టపడాలని, సుఖభోగులు సుఖపడాలని అలా జరగాలనేది భగవదాదేశం అని, కాబట్టి చీమలు కష్టపడాలని వాటి కష్టం మీద తాము సుఖపడాలని అదే న్యాయం ధర్మం అని కాదన్నవాన్ని కాటేసి చంపుతాం అని అంటుంది ఆ రాక్షసాకారం. శాస్త్రాలు చెప్పని సత్యం, ధర్మాత్ములు దాచిన సత్యం, తమ కష్టాన్ని ఇతరులు దొంగిలించి సుఖిస్తారని ఎవ్వరూ చెప్పని సత్యం ఆ రాక్షసాకారం వలన తెలుసుకొని నిచ్చేష్టురాలైన చీమకు జ్ఞానోదయమవుతుంది. "ఒరే! రాక్షసాధముడా, మేము కష్టజీవులమే కావచ్చు. నువ్వు సుఖభోగివే కావచ్చు. కానీ, నువ్వు మాకష్టాల్ని అపహరించి మాకు అన్యాయం చేయడం మేము సహించం. మేం తిరగబడతాం. నువ్వు చెప్పిన న్యాయం భగవన్న్యాయమైన సరే, అది అన్యాయం కాబట్టి, దాన్ని మేము మారుస్తాం. అందు గురించి మేము తిరగబడతాం. మీ మీద మేము తిరగబడి తీరుతాం". అని అంటుంది చీమ అలా అని, చీమ రాక్షసాకారానికి చెప్పడమే కాకుండా తన తోటి సోదరులకు హితబోధ చేసి వారిని వీరులుగా మార్చి రాక్షసాకారం చెప్పే భగవన్న్యాయంపై తిరుగుబాటు చేసేలా చేస్తుంది. రాక్షసాకారం పీడను వదిలిస్తుంది. ఇదీ, పిపీలికంలో రావిశాస్త్రి చిత్రించిన సమాజ రీతి. ఈ రీతిని, ప్రశ్నించడమే ఈ కథలోని నీతి. కష్టజీవుల కష్టాన్ని దోచుకుంటూ, అదే న్యాయం అదే ధర్మం అని ధర్మ సూత్రాలు వల్లిస్తూ, భగవంతుని పేరుతో సామాన్యుల్ని పీడిస్తే, ఆ పీడన ఎన్నాళ్లో, ఎన్నేళ్లో సాగదని, దాన్ని వారు ఎదిరించి తీరుతారని, తిరగబడి తీరుతారని సందేశాన్ని రావిశాస్త్రి ఈ కథలో మనకు అందిస్తారు. వ్యవస్థలోని బలవంతులు బలహీనులను పీడిస్తే వారంతా ఏకమై - ఆ వ్యవస్థ అది, ఎంత బలవంతమైనదైనా బలవంతమైన సర్పం వంటిదయినా, దాన్ని అంతమొందిస్తారనే సందేశాన్ని ఈ కథ ద్వారా రావిశాస్త్రి మనకు అందించారు.